క్లుప్తంగా

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న తెలుగు ఉపాధ్యాయిని మాధవీలత

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయిని మాధవీలత తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. మంగళవారం తిరుపతి జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయినిగా సేవలందిస్తున్నందుకు గాను మాధవీలత గవర్నర్ చేతుల మీదుగా సావిత్రి భాయి పూలే అవార్డును అందుకున్నారు. ఆమెను డీఈవో విజయేంద్రరావు, డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవో సెల్వరాజ్, పీసీఆర్ హెచ్ఎం మీనాక్షి, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ఆపస్ డైరీ ఆవిష్కరణ



ఆపస్ డైరీని ఆవిష్కరిస్తున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ముద్రించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆవిష్కరించారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ తెలిపారు. మంగళవారం విజయవాడలో రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, నాయకులు చక్రపాణి, కృష్ణార్జునరెడ్డి, రాజ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పెయింటింగ్ పనులకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న పార్థసారథి నాయుడు

చిత్తూరు రూరల్: చిత్తూరు గిరింపేటలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో పెయింటింగ్ పనులకు మంగళవారం దాత పార్థసారథి నాయుడు రూ.10 వేలను నిర్వాహకులు కుట్టిరాయల్‌కు అందజేశారు. కార్యక్రమంలో మురళి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాపాక్షి జెడ్పీ హైస్కూలు తనిఖీ



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీవైఈఓ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర పరిధిలోని మాపాక్షి జెడ్పీ హైస్కూలును మంగళవారం డీవైఈఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. తొలుత నాడు–నేడు పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పిల్లలకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం మధ్యాహ్నం భోజనం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఘనంగా ఓంశక్తి పూజలు



గుడిపాల: మండలంలోని వసంతాపురంలో మంగళవారం ఓంశక్తి మాలధారణ భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

వేణుగోపాలుడి విహారం



పుర వీధుల్లో దర్శనమిస్తున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామివారు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అర్చకులు నారాయణదాసరి, గోపాలాచారి వేకుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో పాటు వేణుగోపాలున్ని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై వేంచేపు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ స్వామివారిని ఊరేగించారు. సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబు గణేష్, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ఆనందమే లక్ష్యం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



పింఛన్లు పంపిణీ చేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: అవ్వాతాతల ఆనందమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. నగదు పెంచిన పింఛన్లను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలో 3,085 కొత్త పింఛన్లు, పాత పింఛనుదారులు 9,648 మంది ఉన్నారన్నారు. వీరందరికీ రూ.2750కు పింఛను పెంచి ప్రభుత్వం ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లు పండుగ ఆనందంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. పింఛన్లు తొలగిస్తారని ఎల్లోమీడియా చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మరాదన్నారు. అర్హులందరికీ పథకాలు, పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎంకు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జగనన్న ఎదుర్కోలేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి, తహసీల్దార్ సుశీలమ్మ, పార్టీ నాయకులు దేవేంద్రరెడ్డి, టెరిన్ రెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ధనచంద్రారెడ్డి, రాము, మురళి, సురేంద్రయాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

మండలంలోని వేదగిరివారిపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

నేడు చింతలగుంట, గువ్వకల్లులో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం చింతలగుంట, గువ్వకల్లు పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్వహిస్తారని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు చింతలగుంటలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

దురలవాట్లకు బానిసలు కావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

గుడిపాల: దురలవాట్లకు ప్రజలెవ్వరూ బానిసలు కారాదని గుడిపాల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వసంతాపురం సచివాలయంలో మంగళవారం సర్పంచ్ రజనీకాంత్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సైబర్‌నేరాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మట్కా, పేకాట వంటి అసాంఘిక చర్యలకు పాల్పడరాదని, ఇసుక, మద్యం అక్రమంగా రవాణా చేయడం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని నమ్మబలికి ఆగంతకులు నగదును కాజేస్తున్నారన్నారు. బ్యాంకునుంచి ఎవరూ ఫోన్లు చేయరని, ఓటీపీలు కూడా ఎవరితోనూ షేర్ చేసుకోరాదని, ఇవన్నీ సైబర్ నేరగాళ్లు చేసే పని అన్నారు.సంక్రాంతి పండుగ రానున్న నేపథ్యంలో జల్లికట్టు నిర్వహించరాదన్నారు.

దుకాణాలలో తనిఖీలు

-స్వీట్ స్టాల్‌పై కేసు నమోదు



దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార తనిఖీ అధికారి సతీష్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు దుకాణాలలో జిల్లా ఆహార తనిఖీ అధికారి సతీష్‌కుమార్ మంగళవారం కూడా తనిఖీలు చేశారు. స్థానిక గిరింపేట, దుర్గానగర్ కాలనీ, దర్గాసర్కిల్, పాతమార్కెట్ వీధి ప్రాంతాల్లోని స్వీట్‌స్టాల్స్, పానిపూరీ, బజ్జీల దుకాణాల్లో వాడుతున్న నూనెను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నూనె వాడుతున్న ఓ స్వీట్ షాప్‌పై కేసు నమోదు చేశారు. జిల్లా ఆహార తనిఖీ అధికారి మీడియాతో మాట్లాడుతూ, ఓ స్వీట్ దుకాణంలో వాడుతున్న నూనె 39 పాయింట్లు వచ్చిందన్నారు. నిబంధనల ప్రకారం 25 పాయింట్లకు మించి ఉంటే ఆరోగ్యానికి ప్రమాదమన్నారు. దీంతో ఆ దుకాణంపై కేసు నమోదు చేశామన్నారు. మొత్తం 7 దుకాణాలను తనిఖీ చేశామని, దర్గాసర్కిల్ వద్ద ఉన్న బజ్జీస్టాల్ అపరిశుభ్రంగా ఉందని నిర్వాహకుడిని హెచ్చరించామన్నారు. నూనెను రెండుసార్లకు మించి వాడారాదన్నారు. పాత నూనెను బయోడీజిల్ తయారు చేస్తున్న సంస్థకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

బంగారుపాళెం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్ రాయన్ అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి లెప్రసీ, డెంగీ, మలేరియా, టిబి వంటి జబ్బుల గురించి వివరించి చైతన్య పరచాలన్నారు. మహిళా వైద్యాధికారి డాక్టర్ శిరీష మాట్లాడుతూ, సిబ్బంది ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ షమీమ్, డీపీఎంఓ దయానంద్, ఎంపీహెచ్ఈఓ బృహస్పతి, సూపర్‌వైజర్లు హరికృష్ణ, సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలన



ఓటివారిపల్లెలో సర్వేని పరిశీలిస్తున్న తహసీల్దార్ చిట్టిబాబు

యాదమరి: మీ భూమి–మీ హక్కు కార్యక్రమంలో మండలంలోని ఓటివారిపల్లెలో నిర్వహిస్తున్న రీ సర్వేను మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్ చిట్టిబాబు పరిశీలించారు. సర్వేయర్ చిరంజీవి, సిబ్బందితో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు.

బడిబయట పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించండి

– ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బడిబయట పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ సూచించారు. శిక్షణలో భాగంగా ఆయన మంగళవారం డీఈఓ కార్యాలయాన్ని సందర్శించారు. నాడు–నేడు పనులు, భవిత కేంద్రాల పనితీరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేస్తున్న పనులను, సర్కారు బడుల గురించి డీఈఓ విజయేంద్రరావు ట్రైనీ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో కలెక్టర్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 9 గంటలకు నూతన పింఛన్లు, పెంచిన పింఛన్లను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలో 377 మంది కొత్త పింఛనుదారులు రూ.10.76 లక్షలు, పెంచిన పింఛన్లకు సంబంధించి 9614 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.2,53,07,750 పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ఆధార్ అనుసంధానం చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని సబ్సిడీ సర్వీసులకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఈఈ, డీఈలతో మాట్లాడారు. పలు సబ్సిడీ సర్వీసులకు ఆధార్ అనుసంధానం వేగవంతంగా చేయడం లేదని, పూతలపట్టులో 50 శాతం మాత్రమే అనుసంధానం చేశారన్నారు. హెచ్‌టీ సర్వీసుల రీడింగ్‌లను డీఈలు ఆన్‌లైన్ ద్వారా బిల్లింగ్ ఇవ్వాలన్నారు. గతంలో కంటే విద్యుత్ బిల్లుల కలెక్షన్ శాతం పెరిగిందని, ఇలాగే ప్రతినెలా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరి, ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి పూజలు

చిత్తూరు రూరల్: చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ద్వాదశిపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామి వారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య పూజల అనంతరం శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాలాజీనాయుడుకు చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గంలో పలు ప్రమాదాలతో నష్టపోయిన బాధితులకు మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్ఎఫ్) కింద చెక్కులు అందజేశారు. చిత్తూరు రూరల్ మండలం చెన్నమ్మగుడిపల్లెకు చెందిన బాలాజీనాయుడు ఓ ప్రమాదంలో కాలును కోల్పోయాడు. దీంతో ఆయనకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. అలాగే నగరంలోని కైలాసపురానికి చెందిన వినోద్‌కుమార్ కలువగుంట నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించాడు. ఆయన భార్య హేమలతకు రూ.2 లక్షల చెక్కును ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఓ అసోసియేషన్ నేతలు

చిత్తూరు: జిల్లా వీఆర్‌ఓ అసోసియేషన్ నేతలు మంగళవారం కలెక్టర్ హరి నారాయణన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీఆర్వోల సమస్యలు, ఉద్యోగోన్నతుల అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బాలాజీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మనాభం, జిల్లా జాయింట్ సెక్రటరీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూపంపిణీలో ఊరగుట్టను మినహాయించరూ!



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

బంగారుపాళెం: భూపంపిణీ నుంచి మొగిలి ఊరగుట్టను మినహాయించాలని మంగళవారం మొగిలి గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ, మొగిలి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబరు 61లో 59.55 ఎకరాలలో ఊరగుట్ట ఉందన్నారు. ఈ భూమిలో కొన్నేళ్ల నుంచి పశువులు, మేకలు మేపుకుంటున్నామన్నారు. అంతేకాకుండా గ్రామానికి చెందిన యానాదులు ఈ భూమిలో కొంత స్థలాన్ని శ్మశానంగా వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఊరగుట్ట డీకేటీ భూమిని గ్రామానికి చెందిన కొందరు భూస్వాములు భూపంపిణీ కింద పట్టా పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని ఎవరికీ ఇవ్వరాదని, గ్రామస్తుల సౌకర్యార్థం అలాగే ఉండేలా చూడాలని కోరారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు

తవణంపల్లె: గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయ చౌదరి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ధాత్రేయచౌదరి మాట్లాడుతూ, గత ఏడాది కంటే నూతన సంవత్సరంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో పని చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం ధాత్రేయచౌదరితోపాటు డాక్టర్ ప్రియాంక, సీహెచ్ఓ వెంకట్రమణను ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భారతి, సూపర్‌వైజర్లు రాజశేఖర్, అమరావతి, హరి, జయమ్మ, హెచ్ఏ సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు: డీఈఓ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్లను జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరోత్తమరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హేమాద్రి, మహిళా అధ్యక్షురాలు పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు



ఎన్‌సీసీ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లు

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఉత్తీర్ణత సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయుడు రాజేంద్ర అందజేశారు. ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణ, సామాజిక సేవ, ధైర్యసాహసాలు కలిగిన విద్యార్థులకు ఎన్‌సీసీ వరమన్నారు. ఎన్‌సీసీ శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు, దేశసేవ కోసం నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ప్రసాద్‌రెడ్డి, గిరిజ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దార్శనికురాలు సావిత్రిబాయి పూలే



బంగారుపాళెం : ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న నాయకులు



యాదమరి : ఉపాధ్యాయినులకు బహుమతులు ఇస్తున్న ఎంఈఓ రుక్మిణి



బంగారుపాళెం: పీడీవీ కంద్రిగ హైస్కూల్‌లో..

బంగారుపాళెం: భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి శ్రీమతి సావిత్రీబాయిపూలే గొప్పదార్శనికురాలని ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్లప్ప అన్నారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుస్సా నాగరాజగౌడ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే 192 జయంతి(జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం)ని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎల్లప్ప మాట్లాడారు. మహాత్మా జ్యోతీరావు పూలే తన భార్య సావిత్రీబాయిపూలేని చదివించి, ఉపాధ్యాయ వృత్తిలో చేర్పించారన్నారు. మహిళల్ని విద్యావంతులను చేయడానికి ఆమె ఎనలేని కృషి చేశారని స్మరించారు. తన భర్తతో కలసి బడుగు బలహీన వర్గాల అణిచివేతకు వ్యతిరేకంగా అగ్రవర్ణాలపై పోరాటాలు సాగించారన్నారు. జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్..సావిత్రీ బాయి పూలే జీవిత చరిత్రను గురించి వివరించారు. అనంతరం బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఈడిగ గౌడ్ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తిగౌడ్, బీసీ నాయకులు జనార్ధన్‌గౌడ్, చిరంజీవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెం: మండలంలోని పీడీవీ కంద్రిగ జెడ్పీ హైస్కూలులో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సీఆర్‌సీ పరిధిలోని ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గోపినాథం మాట్లాడుతూ, రచయితగా, సంఘ సంస్కర్తగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి భర్త జ్యోతీరావుపూలేతో కలసి పోరాటం సాగించిన ధీశాలి సావిత్రిభాయి అని కీర్తించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ హెచ్ఎం విజయకుమారి, జాయింట్ కార్యదర్శి ఉమ, నరసింహులు, సీఆర్‌సీ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఘనంగా నిర్వహించింది. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఎంఈఓ రుక్మిణీ, జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, హెచ్ఎం గిరిరాజ మాట్లాడారు. అందరూ సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో పనిచేయాలని టీచర్లకు పిలుపునిచ్చారు. ఎక్కడ మహిళలు విద్యావంతులుగా ఉంటారో ఆ సమాజంలో సుఖసంతోషాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం 60 మంది ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకాచారి, నాయకులు శివప్రసాద్, సురేష్‌రెడ్డి, షకీల్, షెహనజ్, అమరనాథ్‌రెడ్డి, మదనమోహన్ రెడ్డి, గుణశేఖర్, వాసు, కాంచన, సుశీల, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.